www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

విలీనం పేరుతో పేద విద్యార్థులను విద్యకు దూరం చేయొద్దు!

తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పేరుతో గ్రామీణ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయొద్దు
విద్యాశాఖ జీవోలను వెంటనే రద్దు చేయాలి.. లేకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం
స్వేరోస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోండ్రు రామచంద్రు, సోంపాంగు శ్యాంసుందర్



హైదరాబాద్ సంపుటి: 05 సంచిక: 285 శుక్రవారం 13-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు: 05 వెల : 5

బొగ్గు నాణ్యతే సింగరేణి ప్రతిష్ఠకు కీలకం

- నాణ్యతా ప్రమాణాల సాధనకు సమష్టి కృషి చేయాలి
- కొత్తగూడెం ఏరియాలో ఘనంగా బొగ్గు నాణ్యత వారోత్సవాలు–2026 ప్రారంభం

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 12 (భద్రాద్రి న్యూస్):

సింగరేణి సంస్థ ప్రతిష్ఠతో పాటు వినియోగదారుల విశ్వాసం బొగ్గు నాణ్యతపైనే ఆధారపడి ఉంటుందని, నిర్దేశించిన నాణ్యతా లక్ష్యాలను సాధించేందుకు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో కృషి చేయాలని

మిగతా 4లో..





ఆర్థిక భరోసా

మారుమూల గ్రామాల అభివృద్ధిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

- చేయూతతో వితంతువులు, ఒంటరి మహిళలకు ఆత్మస్థైర్యం
- నియోజకవర్గంలో 3,928 కొత్త పెన్షన్లు మంజూరు
- సాంకేతిక కారణాలతో నిలిచిన అర్హుల పెన్షన్లనూ మంజూరు చేయిస్తాం: ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 12 (భద్రాద్రి న్యూస్):

అర్హులైన నిరుపేదలకు సామాజిక భద్రత పెన్షన్లు ఎంతో ఆర్థిక భరోసానిస్తాయని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు. దివ్యాంగులు ఇతరులపై ఆధారపడకుండా ఆత్మ గౌరవంతో జీవించేందుకు, వితంతువులు, ఒంటరి మహిళలు తమ కనీస అవసరాలు

మిగతా 5లో..

గురుకుల వసతిగృహంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- 420 మంది విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి
- విధుల్లో లేని వార్డెన్‌కు మెమో జారీ చేయాలని ఆదేశం



3

ఏఎల్‌పీఏ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

- రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి
- నవంబర్ 14న హనుమకొండలో ఆరో రాష్ట్ర సదస్సు..
- రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిల్ల రాజేంద్ర ప్రసాద్ పిలుపు



3

గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే భారీ కార్యాచరణ!



- భక్తులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- రూ.16.60 కోట్లతో రహదారుల అభివృద్ధి..
- 75 ఎకరాల్లో పార్కింగ్ పరిశీలన
- ఏడు రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలి..
- అధికారులకు కలెక్టర్ అంకిత్ ఆదేశం

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 12 (భద్రాద్రి న్యూస్):

2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని భద్రాచలం వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇప్పటి నుంచే పకడ్బందీ ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ఘాట్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు, తాగునీరు, పారిశుధ్యం తదితర అంశాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో పుష్కరాల ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు.

రూ.16.60 కోట్లతో రహదారుల అభివృద్ధి

భద్రాచలం ఆలయానికి చేరుకునే రహదారుల అభివృద్ధిలో భాగంగా వంతెన నుంచి ఆలయం వరకు సుమారు రూ.14 కోట్లు, బండ్ నుంచి ఆలయం వైపు రూ.2.60 కోట్లతో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. రోడ్లు, భవనాలు,

మిగతా 2లో..

సైన్స్ కాంగ్రెస్‌లో త్రివేణి విద్యార్థుల సత్తా!

- **120 ప్రాజెక్టుల్లో టాప్-6లో చోటు.. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక**
- **'పంట వ్యర్థాల నుంచి రసాయనాలు' ప్రాజెక్టుతో విద్యార్థుల ప్రతిభ**

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 12 (భద్రాద్రి న్యూస్):

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీల్లో ఖమ్మంలోని త్రివేణి పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 32వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ (ఎన్‌సీఎస్‌సీ) జిల్లా స్థాయి పోటీల్లో త్రివేణి పాఠశాల ఇంపాక్ట్ విభాగానికి చెందిన 9వ తరగతి విద్యార్థులు డి. హరిచరణ్, బి. వర్షన్ రూపొందించిన ప్రాజెక్టు ఉత్తమ ఆరు ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచింది.

జిల్లాస్థాయిలో మొత్తం 120 ప్రాజెక్టులు ప్రదర్శించగా, విద్యార్థులు రూపొందించిన 'క్రాప్ రెసిడ్యూ టు కెమికల్స్' (పంట వ్యర్థాల నుంచి రసాయనాలు) అనే వినూత్న ప్రాజెక్టు న్యాయనిర్ణేతల ప్రశంసలు అందుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. గైడ్ టీచర్ కె. సుధాకర్ మార్గదర్శకత్వంలో విద్యార్థులు ఈ ప్రాజెక్టును రూపొందించారు.

120 ప్రాజెక్టుల్లో ఆరు ఉత్తమ ప్రాజెక్టుల్లో చోటు దక్కించుకోవడంపై పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, సీఎస్ఓ సుబ్బారావు, జాట్ ఇన్‌చార్జి అర్చనా ఠాకూర్ విద్యార్థులతో పాటు గైడ్ టీచర్ కె. సుధాకర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, సృజనాత్మక ఆలోచనలు అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విజయం సాధించి పాఠశాలకు మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.





ఏజెన్సీ ప్రాంతాల్లో న్యాయవ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

- **భద్రాచలం కేంద్రంగా అదనపు సెషన్స్ కోర్టు ఏర్పాటు చేయాలి**
- **ఏటూరునాగారంలో జేఎంఎఫ్‌సీ కోర్టు.. హైకోర్టు జడ్జి జస్టిస్ కాజా శరత్‌కు బార్ అసోసియేషన్ వినతి**

భద్రాచలం, నవంబర్ 12 (భద్రాద్రి న్యూస్):

ఏజెన్సీ ప్రాంతాల్లో న్యాయవ్యవస్థను బలోపేతం చేసి, గిరిజన, గ్రామీణ ప్రజలకు సత్వర న్యాయం అందుబాటులోకి తీసుకురావాలని భద్రాచలం బార్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు గురువారం సారపాకలోని ఐటీసీ పీఎస్పీడీ గెస్ట్‌హౌస్‌లో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కాజా శరత్‌ను బార్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పలు కీలక అంశాలతో కూడిన వినతిపత్రాలను సమర్పించారు. భద్రాచలం డివిజన్ పరిధిలో కేసుల సంఖ్య, భౌగోళిక విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుని కక్షిదారుల సౌకర్యార్థం భద్రాచలం కేంద్రంగా అదనపు సెషన్స్ కోర్టును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా భద్రాచలం కోర్టు పరిధిలో క్రిమినల్ కేసులు అధిక సంఖ్యలో పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ఖాళీగా ఉన్న జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ పోస్టులో పూర్తిస్థాయి మేజిస్ట్రేట్‌ను తక్షణమే నియమించాలని కోరారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 244(1), ఐదవ షెడ్యూల్ పరిధిలోని ఆదివాసీ సమాజాల రాజ్యాంగపరమైన, చట్టబద్ధమైన, సంప్రదాయ హక్కుల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. భూ బదలాయింపు నిరోధక చట్టం, పెసా చట్టం, అటవీ





హక్కుల చట్టానికి సంబంధించిన కేసులను వేగంగా విచారించి గిరిజనులకు న్యాయం అందించేందుకు తెలంగాణ హైకోర్టులో ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే వెంకటాపురం, వాజేడు, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, తాడ్వాయి, మంగపేట వంటి మారుమూల అటవీ, ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు న్యాయం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బందులను నివారించేందుకు ఏటూరునాగారం కేంద్రంగా నూతన జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టును ఏర్పాటు చేయాలని న్యాయమూర్తికి సమర్పించిన వినతిపత్రంలో కోరారు.

ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, జనరల్ సెక్రటరీ పూసాల శ్రీనివాసాచారి, ఉపాధ్యక్షులు సున్నం రమేష్, సీనియర్ న్యాయవాదులు ఎం.వి. రమణారావు, టి. చైతన్య, పామరాజు తిరుమలరావు, చీమల నరసింహారావు, కొరస కృష్ణార్జున రావు, సున్నం వెంకటరమణ, కారం రమేష్, నరేష్, మధు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

డీసీసీబీ కలెక్టర్ పర్సన్ ఇన్‌చార్జి దివాకర్‌కు కొత్వాల ఘన సన్మానం

- **129వ మహాజనసభలో పాల్గొన్న పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు**
- **రైతుల వాయిదా మీరిన రుణాలను రెన్యువల్ చేయాలని సీఈఓకు వినతి**

పాల్వంచ, నవంబర్ 12 (భద్రాద్రి న్యూస్):

ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) 129వ మహాజనసభ గురువారం ఖమ్మంలోని డీసీసీబీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు పలువురు సొసైటీల అధ్యక్షులతో కలిసి కలెక్టర్ టి.ఎస్. దివాకర్‌ను శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు.

అనంతరం మహాజనసభలో కొత్వాల మాట్లాడుతూ పాల్వంచ సొసైటీ పరిధిలోని రైతుల వాయిదా గడువు ముగిసిన రుణాలను రెన్యువల్ చేయాలని కోరారు. ఈ



మేరకు డీసీసీబీ సీఈఓ ఎస్. వెంకట ఆదిత్యకు వినతి పత్రం అందజేశారు. రైతులకు రుణాల విషయంలో ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్



పి. శ్రీనివాసరెడ్డి, ఖమ్మం డీసీఓ జి. గంగాధర్, భద్రాద్రి కొత్తగూడెం డీసీఓ అవధానుల శ్రీనివాస్, కొత్తగూడెం సొసైటీ చైర్మన్ మండె వీర హనుమంతరావు, పలువురు సహకార సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన

- **రాజ్యసభ మాజీ సభ్యుడు కే.ఆర్. సురేష్‌రెడ్డి నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు**

నిజామాబాద్, నవంబర్ 12 (భద్రాద్రి న్యూస్):

గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు, యువతకు చదువుకునేందుకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు విజ్ఞానాభివృద్ధికి తోడ్పడే లక్ష్యంతో కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామంలో గ్రంథాలయ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రాజ్యసభ మాజీ సభ్యుడు కే.ఆర్. సురేష్‌రెడ్డి నిధుల నుంచి మంజూరైన రూ.5 లక్షలతో చేపట్టనున్న ఈ నిర్మాణ పనులకు గురువారం గ్రామ సర్పంచ్ బైకాని జమున మహేష్ శంకుస్థాపన చేశారు. గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు కావడం వల్ల విద్యార్థులు, యువతకు వివిధ పుస్తకాలు చదివే అవకాశం లభించడంతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు. గ్రామ ప్రజలకు విజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో గ్రంథాలయం కీలక పాత్ర పోషించనుంది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిలివేరి భూమేష్, పంచాయతీ కార్యదర్శి నవీన్ గౌడ్, వార్డు సభ్యులు బండెల రాజు, నెల్ల రమేష్, అంకాడి శేఖర్, చిలివేరి లక్ష్మి, నాయకులు డి. రవి, బీఎన్ మోహన్, ప్రశాంత్, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



గురుకుల వసతిగృహంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- **420 మంది విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి**
- **విధుల్లో లేని వార్డెన్‌కు మెమో జారీ చేయాలని ఆదేశం**

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 12 (భద్రాద్రి న్యూస్):

ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన, సమతుల్యమైన పౌష్టికాహారం అందించడంతో పాటు మెరుగైన వసతి, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

గురువారం బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల బాలుర గురుకుల పాఠశాల, కళాశాల వసతిగృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ వసతిగృహంలో 320 మంది పాఠశాల విద్యార్థులు, 100 మంది కళాశాల విద్యార్థులు కలిపి మొత్తం 420 మంది ఉంటున్నట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సిద్ధం చేసిన ఆహార పదార్థాలు, వంటశాల, భోజనశాల, స్టోర్ రూమ్‌ను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజనం నాణ్యత, రుచి, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా, నిర్ణీత



సమయానికి భోజనం పెడుతున్నారా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.

వంటకు ఉపయోగిస్తున్న కూరగాయలు, బియ్యం, ఇతర నిత్యావసర వస్తువుల నాణ్యతను పరిశీలించారు. ఆహార పదార్థాల నిల్వ, వాటి వినియోగ కాలం, స్టాక్ బుక్ రికార్డులను తనిఖీ చేశారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం అందించే అల్పాహార వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థులకు ప్రతిరోజూ తాజా కూరగాయలు, నాణ్యమైన ఆహార పదార్థాలతో పౌష్టికాహారం అందించాలని సూచించారు. వంటశాల, నిల్వ గదులు పరిశుభ్రంగా ఉంచాలని, ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఫుడ్ పాయిజనింగ్ వంటి ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అలాగే ఆర్ఓ ప్లాంట్ పనితీరును పరిశీలించి విద్యార్థులకు నిరంతరం శుభ్రమైన, సురక్షితమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఆహారం, తాగునీరు, వసతి సౌకర్యాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని తెలిపారు.

అనంతరం విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ పాఠ్యాంశాలపై పట్టు సాధించి, ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి పాఠశాల, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు. పీఈటీల సహకారంతో క్రీడల్లో శిక్షణ పొంది ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే భారీ కార్యాచరణ!

మొదటిపేజీ తరువాయి



దేవాదాయ శాఖ అధికారులు సమన్వయంతో అంచనాలు సిద్ధం చేసి నిర్దిత గడువులో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. హామ్ రహదారుల మరమ్మతులు, ఒప్పంద సమస్యలను కూడా పరిష్కరించాలని సూచించారు.

ఘాట్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

భద్రాచలం పరిధిలో కొత్త ఘాట్ల నిర్మాణంతో పాటు ఇప్పటికే ఉన్న ఘాట్ల మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. దుమ్ముగూడెం ఘాట్ మరమ్మతు పనులను వేగవంతం చేయడంతో పాటు బూర్గంపాడు మండలం మోతే వద్ద వీఐపీ ఘాట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించాలని ఆదేశించారు. ఘాట్ల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్యం, సురక్షిత స్నానాలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.

75 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్ల పరిశీలన

పుష్కరాల సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని భద్రాచలం, బూర్గంపాడు, మణుగూరు, దుమ్ముగూడెం ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు, హోల్డింగ్ ఏరియాలను గుర్తించాలని సూచించారు. సారపాక పుష్కరవనం పరిధిలోని సుమారు 75 ఎకరాల స్థలాన్ని చెట్లకు నష్టం కలగకుండా పార్కింగ్ అవసరాలకు వినియోగించే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. అవసరమైతే మరో 30 ఎకరాల భూమిని గుర్తించడంతో పాటు 10 ఎకరాలను ప్రత్యామ్నాయంగా సిద్ధం చేయాలన్నారు.

ప్రైవేటు భూములను వినియోగించాల్సి వస్తే రైతులతో ఆరు నెలల ముందుగానే సంప్రదింపులు జరిపి, పంట నష్టం, భూమి వినియోగానికి సంబంధించిన పరిహారంపై స్పష్టత ఇవ్వాలని సూచించారు. కలెక్టర్, ఎస్పీ, సంబంధిత అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి అనువైన స్థలాలను గుర్తించాలని ఆదేశించారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక

పుష్కరాల సమయంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ముందుగానే నిర్ధారిస్తామని ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. పార్కింగ్ స్థలాలు, ప్రధాన కూడళ్ల వద్ద సూచిక బోర్డులు, రేడియం, ఎల్ఈడీ బోర్డులు, రాత్రి వేళల్లో తగిన వెలుతురు ఏర్పాటు చేస్తామన్నారు. భక్తుల భద్రతకు అవసరమైన పోలీసు బందోబస్తు కల్పిస్తామని వివరించారు.

కమాండ్ కంట్రోల్ రూమ్.. వైద్య శిబిరాలు

భక్తుల రద్దీని సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. శ్రీరామనవమి ఉత్సవాల అనుభవాలను పరిగణనలోకి తీసుకొని క్యూలైన్లు, తాగునీటి పాయింట్లు, ప్రసాదం కౌంటర్లు, అన్నదాన కేంద్రాలు, ఫుడ్ కోర్టులకు అనువైన ప్రదేశాలను గుర్తించాలన్నారు.

భద్రాచలం, పర్ణశాల ప్రాంతాల్లో తాత్కాలిక ఆసుపత్రులు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని, అవసరమైన వైద్య సిబ్బంది, మందులు, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తాత్కాలిక సదుపాయాలకు వాటర్‌ప్రూఫ్ టెంట్లను వినియోగించాలని సూచించారు.

పర్యాటక అభివృద్ధికి అవకాశాలు

ఘాట్లు, పార్కింగ్ ప్రాంతాలు, రహదారులు, శానిటరీ కాంప్లెక్స్‌ల వద్ద నిరంతర పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. భక్తులకు వసతి కల్పించేందుకు గెస్ట్‌హౌస్‌లను గుర్తించాలని, వీఐపీల వసతి, వాహనాల పార్కింగ్, పరిసరాల అభివృద్ధిపై దృష్టి సారించాలని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో పర్యాటక కాటేజీలు, క్యాంపింగ్ సదుపాయాల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అవసరమైన చోట ఐటీసీ వంటి సంస్థల సీఎస్ఆర్ నిధుల సహకారాన్ని కూడా పరిశీలించాలన్నారు.

ఏడు రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలి

అన్ని శాఖలు తమ పరిధిలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి సమగ్ర అంచనాలు, వివరణాత్మక ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత కన్సల్టెంట్ ఏడు రోజుల్లో సమగ్ర నివేదిక అందించాలని, తాత్కాలిక సదుపాయాల ఏర్పాట్లకు సంబంధించి రెండు రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని గడువు విధించారు.

శాఖల మధ్య సమన్వయంతో పనులు పూర్తి చేయాలని, బాధ్యతలను ఒకరిపై మరొకరు నెట్టివేయకుండా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని స్పష్టం చేశారు. పుష్కరాలు ప్రారంభమయ్యే సమయానికి అన్ని అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉండేలా అధికారులు నిర్దిష్ట గడువులతో పనిచేయాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.

ఈ సమావేశంలో డీపీఓ అనూష, సీపీఓ సునీత, దేవాదాయ శాఖ ఈఓ దామోదరరావు, నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, రవాణా, పర్యాటక, ఆర్టీసీ, అగ్నిమాపక, మత్స్యశాఖల అధికారులు, డీపీఆర్వో, సంబంధిత మండలాల తహసీల్దార్లు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ రోహిత్ రాజు వార్షిక తనిఖీ

- **ఆర్మ్డ్ రిజర్వ్ కార్యాలయాలు, బాంబు డిస్పోజల్ టీమ్, డాగ్ స్క్వాడ్ పనితీరుపై సమీక్ష**
- **క్రమశిక్షణ, నిబద్ధతతో ప్రజలకు మెరుగైన సేవలందించాలి: ఎస్పీ**

కొత్తగూడెం, నవంబర్ 12 (భద్రాద్రి న్యూస్):



పోలీస్ అధికారులు, సిబ్బంది క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సూచించారు. విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు.

గురువారం హేమచంద్రపురంలోని జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందికి సంబంధించిన ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించారు.

తదుపరి అడ్మిన్ ఆర్ఐ, మోటార్ ట్రాన్స్‌పోర్ట్, వెల్ఫేర్, హోంగార్డ్స్ కార్యాలయాలను సందర్శించి నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేశారు. బాంబు డిస్పోజల్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందాల పనితీరును పరిశీలించి, వాటి నిర్వహణ, విధి నిర్వహణకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అధికారులు, సిబ్బంది నిరంతరం అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. అవసరమైన శిక్షణ పొందుతూ వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు ప్రతిరోజూ వ్యాయామం, యోగా, ధ్యానం అలవాటు చేసుకోవాలని పేర్కొన్నారు. విధుల్లో అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందించాలని సూచించారు.

అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది వ్యక్తిగత సమస్యలను అడిగి తెలుసుకున్న ఎస్పీ, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఇ. శ్రీనివాస్, ఆర్ఐ ఎంటీఓ సుధాకర్, ఆర్ఐ హోంగార్డ్స్ నరసింహారావు, ఆర్ఐ అడ్మిన్ లాల్ బాబు, ఆర్ఐ వెల్ఫేర్ కృష్ణారావు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





ఐఎల్‌పీఏ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

- **రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి**
- **నవంబర్ 14న హనుమకొండలో ఆరో రాష్ట్ర సదస్సు..**
- **రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిల్ల రాజేంద్ర ప్రసాద్ పిలుపు**

వరంగల్, నవంబర్ 12 (భద్రాద్రి న్యూస్):

హనుమకొండ జిల్లా కేంద్రంలోని డీ కన్వెన్షన్‌లో ఈ నెల 14న నిర్వహించనున్న ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ) తెలంగాణ ఆరో రాష్ట్ర సదస్సుకు రాష్ట్రంలోని న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఐఎల్‌పీఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, సదస్సు కన్వీనర్ చిల్ల రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం వరంగల్ జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులు, ఐఎల్‌పీఏ నాయకులతో కలిసి సదస్సు గోడపత్రికలను ఆవిష్కరించి ఆయన విలేకరులతో మాట్లాడారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇచ్చిన ‘పే బ్యాక్ టు సొసైటీ’ పిలుపు స్ఫూర్తితో ‘నల్లకోట్లతో నీలి విప్లవం’ నినాదంతో ఐఎల్‌పీఏ పనిచేస్తోందని తెలిపారు. మహాత్మా జ్యోతిరావు ఫూలే, అంబేద్కర్ సిద్ధాంతాల పునాదిగా బహుజన, అణగారిన, పేద న్యాయవాదుల వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు బహుజన సమాజంలో చైతన్యం తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

ఐఎల్‌పీఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సదస్సు కోకన్వీనర్ తీగల జీవన్ గౌడ్ మాట్లాడుతూ సాంస్కృతిక విప్లవం విజయవంతం కాకుండా బహుజన సమాజ విముక్తి సాధ్యం కాదన్నారు. భారత రాజ్యాంగం కేవలం న్యాయవాదులకు ఉపయోగపడే గ్రంథం మాత్రమే కాదని, బడుగు, బలహీన వర్గాల జీవితాలను మార్చే స్ఫూర్తిదాయక సాధనమని పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని గ్రామగ్రామానికి తీసుకెళ్లడమే ఐఎల్‌పీఏ లక్ష్యమని, అణగారిన వర్గాల న్యాయవాదులకు, ప్రజలకు సంఘం మార్గదర్శిగా నిలుస్తుందని అన్నారు.

ఐఎల్‌పీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ బీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు చౌదరి వికాస్ పటేల్ అధ్యక్షతన రాష్ట్ర సదస్సు జరుగుతుందని తెలిపారు. ముఖ్య అతిథిగా విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ కమిషన్ కమిషనర్ జస్టిస్ ఈద తిరుమలదేవి హాజరవుతారని వెల్లడించారు. గౌరవ అతిథులుగా వరంగల్, హనుమకొండ జిల్లా న్యాయమూర్తులు వి.బి. నిర్మలా గీతాంబ, ఎం.ఆర్. సునీత, పంచాయతీరాజ్ మంత్రి దనసరి అనసూయ సీతక్క, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

సదస్సులో పలు అంశాలపై నిపుణులు ప్రసంగించనున్నట్లు వివరించారు. ‘79 ఏళ్ల స్వతంత్ర భారతంలో మహిళా స్వేచ్ఛ’ అంశంపై ప్రొఫెసర్ ఇ. సుధారాణి, ‘ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపు’ అంశంపై ప్రొఫెసర్ గుగులోతు వీరన్న నాయక్, ‘సామాజిక న్యాయం - బహుజనుల ఐక్యత’ అంశంపై తెలుగు అకాడమీ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, ‘ప్రజాస్వామ్యంలో న్యాయమూర్తుల నియామకం - లోపాలు’ అంశంపై ఐఎల్‌పీఏ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పొన్నం దేవరాజు గౌడ్ ప్రసంగిస్తారని తెలిపారు.

ఈ కార్యక్రమానికి ఐఎల్‌పీఏ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.జె. శాంసన్, బహుజన ముక్తి పార్టీ జాతీయ అధ్యక్షుడు దాసురాం నాయక్, రాష్ట్రీయ ముక్తి మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి ముఫ్తీ మహమ్మద్ ఫహీమొద్దీన్, బ్యాంసెఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డి. నరేందర్‌తో పాటు పలువురు మేధావులు హాజరవుతారని వెల్లడించారు.

ఈ సమావేశంలో ఐఎల్‌పీఏ రాష్ట్ర కమిటీ సలహాదారు బండి మొగిలి, సభ్యులు ఎగ్గడి సుందర్ రామ్, జన్ను పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విలాసాగరం సురేందర్ గౌడ్, గురిమిల్ల రాజు, హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పులిగిల్ల భిక్షపతి, చింత సాంబశివరావు, హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పూసపెల్లి శ్రీనివాస్, నాంపాని చంద్రశేఖర్, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెండ్యాల అనిల్, అనుమాండ్ల రాజ్ కుమార్, ఐఎల్‌పీఏ జిల్లా నాయకులు జన్ను ప్రభాకర్, కలకోటి మహేందర్, అబ్దుల్ నఫీ, కట్కూరి సూరయ్య, అఖిల్ పాషా, కృష్ణ, గట్టు రవి తదితరులు పాల్గొన్నారు.





రూ.7.20 కోట్లతో 72 సమాఖ్య భవనాలు!

- **డ్వాక్రా సంఘాలకు సొంత గూడు కల్పన**
- **మహిళా సాధికారతే లక్ష్యంగా కూనంనేని ముందడుగు**
- **నాలుగు మండలాల్లో వేగంగా భవన నిర్మాణ పనులు**
- **త్వరలో కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలకు మరో 50 భవనాలు**

కొత్తగూడెం అర్బన్ , నవంబర్ 12 (భద్రాద్రిన్యూస్):-

కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) మహిళల సమావేశాలకు ఎలాంటి ఆటంకాలు కలగకూడదన్న సదుద్దేశంతో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రత్యేక చొరవ చూపి నియోజకవర్గానికి 72 గ్రామ సమాఖ్య (వివో) భవనాలను మంజూరు చేయించారు. ఒక్కో భవనానికి రూ. 10 లక్షల చొప్పున మొత్తం రూ. 7 కోట్ల 20 లక్షల వ్యయంతో వీటి నిర్మాణాలను చేపట్టారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు ఈ భవనాలను కేటాయించగా, సుజాతనగర్ మండలానికి 13 భవనాలు మంజూరు కాగా ఇప్పటికే ఒక భవనం పూర్తయి ప్రారంభం కాగా మరో 8 తుది దశకు చేరుకున్నాయి, నాలుగు భవనాల నిర్మాణం త్వరలో ప్రారంభం కానుంది. చుంచుపల్లి మండలంలో 17 భవనాలకు గాను 2 ఇన్‌క్లైన్ వెంకటేశ్వర కాలనీ, అంబేద్కర్ నగర్ ప్రాంతాల్లో రెండు భవనాలు ప్రారంభం కాగా మరో 14 భవనాల పనులు వేగంగా కొనసాగుతున్నాయి, ఒక భవన నిర్మాణం త్వరలో ప్రారంభం కానుంది. లక్ష్మీదేవిపల్లి మండలంలో 21 భవనాలకు 9 భవనాలు, పాల్వంచ మండలంలో 21 భవనాలకు గాను 14 భవనాల నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి, మిగిలిన భవనాల నిర్మాణానికి త్వరలో శంకుస్థాపనలు జరగనున్నాయి. మంజూరైన 72 భవనాల్లో ఎక్కడైనా స్థల సమస్యలు ఎదురైతే తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే కూనంనేని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచి రాబోయే మూడు నాలుగు నెలల్లోగా మొత్తం భవనాలను పూర్తి చేసి మహిళా సంఘాలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. గ్రామీణ మహిళలతో పాటు పట్టణ ప్రాంతాల్లోని మహిళా సంఘాలకు కూడా సొంత భవనాలు సమకూర్చేందుకు ఆయన ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా త్వరలోనే పట్టణ ప్రాంత సమాఖ్యల కోసం మరో 50 నూతన భవనాలను మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ఊపిరిగా, ప్రజా సంక్షేమమే పరమావధిగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అహర్నిశలు శ్రమిస్తున్నారు. మాటలకంటే చేతలకు ప్రాధాన్యతనిస్తూ, కోట్లాది రూపాయల నిధులను రాబట్టి కొత్తగూడెం రూపురేఖలను సమూలంగా మారుస్తున్నారు. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచుతూ, వారి ఆర్థిక స్వావలంబనకు బలమైన పునాదులు వేస్తున్న దార్శనిక నేతగా ఆయన ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ అందిస్తున్న ఈ విశేష సేవలు నియోజకవర్గ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగినవి. మహిళా సాధికారత కోసం ఇంతటి చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చొరవ పట్ల నియోజకవర్గంలోని మహిళా సంఘాల సభ్యులు ప్రత్యేక హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు.





బొగ్గు నాణ్యతే సింగరేణి ప్రతిష్ఠకు కీలకం

మొదటిపేజీ తరువాయి

కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సి.హెచ్. వెంకటరమణ సూచించారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో నవంబర్ 12 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న బొగ్గు నాణ్యత వారోత్సవాలు-2026ను గురువారం ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా జీఎం వెంకటరమణ మాట్లాడుతూ గత అక్టోబర్ నెలలో నిర్దేశించిన లక్ష్యాల్లో కొత్తగూడెం ఏరియా 75 శాతం లక్ష్యాన్ని సాధించిందని తెలిపారు. కొత్తగూడెం ఏరియాలో గ్రేడ్ సంతృప్తి 75.25 శాతంగా నమోదుకాగా, సత్తుపల్లి ఏరియాలో 81.5 శాతంగా నమోదైందని వివరించారు.

బొగ్గు నాణ్యతను మరింత మెరుగుపరచడంతో పాటు నిర్దేశించిన గ్రేడ్‌కు అనుగుణంగా ఉత్పత్తి చేపట్టాలని సూచించారు. క్షేత్రస్థాయిలో నాణ్యతా ప్రమాణాలను పటిష్టంగా అమలు చేయడం ద్వారా వినియోగదారుల సంతృప్తిని పెంపొందించాలని అన్నారు. ప్రతి అధికారి, ఉద్యోగి నాణ్యతా ప్రమాణాల పరిరక్షణను బాధ్యతగా తీసుకుని పనిచేయాలని పిలుపునిచ్చారు. వారోత్సవాల్లో భాగంగా బొగ్గు నాణ్యతపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, మెరుగైన ఫలితాల సాధనకు అందరూ సమష్టిగా కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం గోవిందరావు, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి జె. గట్టయ్య, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్, ఏరియా ఇంజనీర్ (ఏజీఎం) రామకృష్ణ, డిప్యూటీ జనరల్ మేనేజర్ (సివిల్) రాజేందర్ కుమార్, పీవో వీకే సీఎం శంకర్, క్వాలిటీ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె. సత్య నారాయణ రాజు, పర్సనల్ మేనేజర్ తిరుపతి, సర్వే విభాగాధిపతి డి. వెంకటేశ్వర్లు, పర్యావరణ విభాగాధిపతి ఎం.డి. ఫజల్ రెహమాన్, ఏరియా సెక్యూరిటీ అధికారి అభిలాష్‌తో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





అర్హులైన పేదలకు పెన్షన్లే ఆర్థిక భరోసా

మొదటిపేజీ తరువాయి

తీర్చుకునేందుకు చేయూత పెన్షన్లు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

బుధవారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో నియోజకవర్గ పరిధిలోని వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు చేయూత పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కూనంనేని చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా మొత్తం 3,928 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరయ్యాయని వెల్లడించారు. నియోజకవర్గంలో సుమారు 30 వేల మంది అర్హులుగా గుర్తించామని, వారికి విడతలవారీగా పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం చుంచుపల్లి మండలానికి 562, లక్ష్మీదేవిపల్లి మండలానికి 566 పెన్షన్ల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.ఇతర ప్రాంతాలకు మంజూరైన పెన్షన్ల వివరాలను వెల్లడిస్తూ సుజాతనగర్ మండలానికి 228, పాల్వంచ మండలానికి 468, పాల్వంచ పట్టణానికి 919, కొత్తగూడెం పట్టణానికి 1,185 పెన్షన్లు మంజూరయ్యాయని తెలిపారు.

గతంలో పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ వివిధ సాంకేతిక కారణాలతో మంజూరు నిలిచిపోయిన అర్హులైన లబ్ధిదారులకు కూడా త్వరలో పెన్షన్లు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా అధికారులతో సమన్వయం చేసుకుంటూ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ పీడీ విద్యాచందన, ఆర్డీఓ మధు, సీపీఓ నాగలక్ష్మి, ఎంపీడీఓలు సుభాషిణి, సుస్మిత, ఎంపీఓ సందీప్, డీపీవోలు సాంబయ్య, అనూష, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, లైబ్రరీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు వీరబాబు, లాలసింగ్, సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



అథ్లెటిక్స్‌లో త్రివేణి విద్యార్థిని త్రివిక్రమ విజయం!

- **రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు స్వర్ణాలు.. ఒక కాంస్య పతకం కైవసం**
- **జాతీయ స్థాయి పోటీలకు అర్హత.. రుటికను అభినందించిన డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి**

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 12 (భద్రాద్రి న్యూస్):

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఖమ్మంలోని త్రివేణి పాఠశాల విద్యార్థిని భీమాల రుటిక అసాధారణ ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించింది. రెండు స్వర్ణ పతకాలు, ఒక కాంస్య పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించి ఖమ్మం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది.హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో నవంబర్ 10 నుంచి 12 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన 2026-27 రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ 14 విభాగంలో ఖమ్మం జిల్లా తరఫున రుటిక పాల్గొంది. ఈ పోటీల్లో 100 మీటర్ల పరుగు, 4×100 మీటర్ల రిలే విభాగాల్లో ప్రథమ స్థానం సాధించి రెండు స్వర్ణ పతకాలు గెలుచుకుంది. 200 మీటర్ల పరుగులో మూడో స్థానం సాధించి కాంస్య పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది.విద్యార్థిని సాధించిన ఘనత పట్ల త్రివేణి పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. క్రీడల్లో ప్రతిభతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో నూ రుటిక మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

రుటిక విజయంపై సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇన్‌చార్జి విక్టర్ చార్లెస్, రవాణా విభాగం ఇన్‌చార్జి సందీప్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.





కళలతోనే విద్యార్థుల్లో సృజనాత్మక వికాసం!

- **శారీరక, మానసిక ఎదుగుదలకు కళలు దోహదం**
- **జానపద నృత్యాలతో హోరెత్తించిన బాలికలు.. శాస్త్రీయ నృత్యాలతో అలరించిన చిన్నారులు**
- **28 పీఎం శ్రీ పాఠశాలల నుంచి 300 మందికి పైగా విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన**



ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 12 (భద్రాద్రి న్యూస్):

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీయడంతో పాటు వారి శారీరక, మానసిక వికాసానికి కళలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా విద్యాశాఖ అధికారి డి. వాసంతి అన్నారు. చదువుతో పాటు కళలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు ఆసక్తితో పాల్గొనాలని ఆమె సూచించారు. ఖమ్మం జిల్లా సైన్స్ మ్యూజియం ఆవరణలోని సెమినార్ హాల్‌లో గురువారం జిల్లాలోని 28 పీఎం శ్రీ పాఠశాలల జిల్లా స్థాయి కళా, సాంస్కృతిక పోటీలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మొత్తం 10 విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో 300 మందికి పైగా విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు.

ఈ సందర్భంగా డీఈఓ డి. వాసంతి మాట్లాడుతూ.. సాహిత్యం, కళలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో మానసిక వికాసం పెంపొందుతుందని, సృజనాత్మక ఆలోచనలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. వివిధ పోటీల్లో పాల్గొనడం ద్వారా పోటీతత్వం, మేధోసంపత్తి పెరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు తమ అభిరుచికి అనుగుణంగా కళలు, క్రీడలు, సాంస్కృతిక అంశాల్లో నైపుణ్యం సాధించాలని ఆకాంక్షించారు.

పోటీల్లో భాగంగా సోలో, గ్రూప్ విభాగాల్లో జానపద నృత్యాలు, శాస్త్రీయ నృత్యాలు, సోలో, గ్రూప్ గాన పోటీలు, నాటికలు, లఘు నాటికలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ఇతివృత్తంగా చిత్రలేఖనం, రంగుల చిత్రాల పోటీలు నిర్వహించగా, గ్రంథాలయ వారోత్సవాల నేపథ్యంలో పుస్తక పఠనం ప్రాముఖ్యతపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కథలు చెప్పడం, కవిత్వం, పద్యాల పఠనం వంటి అంశాల్లోనూ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ముఖ్యంగా జానపద నృత్యాలతో బాలికలు ఉర్రూతలూగించగా, శాస్త్రీయ నృత్యాలతో చిన్నారులు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. సోలో, గ్రూప్ విభాగాల్లో విద్యార్థులు నువ్వా నేనా అన్నట్లు పోటీపడి తమ ప్రతిభను చాటుకున్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన పోటీలు ఆద్యంతం పండుగ వాతావరణాన్ని తలపించాయి.

జిల్లా విద్యాశాఖ అధికారి డి. వాసంతి నేతృత్వంలో, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి పెసర ప్రభాకర్ రెడ్డి సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. జిల్లా ఎఫ్ఎల్ఎన్ సెల్ సభ్యులు, న్యాయనిర్ణేతలు శ్యామ్‌లాల్, ప్రవీణ్, సేవియా, శ్రావణ్, ఝాన్సీ, మనోరమ, భారతి, షఫీ, 28 పీఎం శ్రీ పాఠశాలల గైడ్ టీచర్లు, ఎస్కార్ట్ టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





విలీనం పేరుతో పేద విద్యార్థులను విద్యకు దూరం చేయొద్దు!

- **తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పేరుతో గ్రామీణ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయొద్దు**
- **విద్యాశాఖ జీవోలను వెంటనే రద్దు చేయాలి.. లేకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం**
- **స్వేరోస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోండ్రు రామచంద్రు, సోంపాంగు శ్యాంసుందర్**



ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 12 (భద్రాద్రి న్యూస్):

గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల విలీనం పేరుతో పేద విద్యార్థులను విద్యకు దూరం చేయొద్దని స్వేరోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కోండ్రు రామచంద్రు, ప్రధాన కార్యదర్శి సోంపాంగు శ్యాంసుందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పేరుతో గ్రామీణ విద్యావ్యవస్థను కేంద్రీకరించే విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, సంబంధిత జీవోలను రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గురువారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పల్లె బడులు పేదింటి బిడ్డల భవిష్యత్తుకు తొలి మెట్లని, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు నిరుపేద కుటుంబాలకు విద్యా ఆధారంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. విద్యా ప్రమాణాలు పెంచడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, అయితే పాఠశాలల విలీనం పేరుతో గ్రామాల్లోని బడులను మూసివేసి చిన్నారులను దూర ప్రాంతాలకు పంపించే విధానాన్ని అంగీకరించబోమని స్పష్టం చేశారు.

చిన్నచిన్న ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేసి ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే ప్రాంగణంలో విద్యాబోధన అందించాలనే ప్రతిపాదన అమలైతే ఎంపీపీ, జడ్పీహెచ్ఎస్, మోడల్ స్కూల్స్, కేజీబీవీల ఉనికికి ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తండాలు, గూడేలు, మారుమూల గ్రామాల్లోని పేద విద్యార్థులు తమ గ్రామాల్లోనే చదువుకునే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులు, ప్రాథమిక తరగతుల విద్యార్థులు ప్రతిరోజూ ఐదు నుంచి పది కిలోమీటర్ల దూరం ప్రయాణించి పాఠశాలలకు వెళ్లాల్సి వస్తే వారి చదువుపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. సరైన రవాణా సదుపాయాలు లేకపోతే చిన్నారుల విద్య ప్రశ్నార్థకంగా మారుతుందని అన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో లేకపోతే పేద తల్లిదండ్రులు అప్పులు చేసి ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ముఖ్యంగా బాలికలు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి రావడం వల్ల రవాణా, భద్రత, కుటుంబ ఆర్థిక పరిస్థితులు వారి విద్యకు అడ్డంకులుగా మారుతాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల నిరుపేద పిల్లలకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలే ప్రధాన విద్యా ఆధారమని, వాటిని దూరం చేస్తే సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు.

సాంఘిక సంక్షేమ గురుకులాలు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు ప్రత్యేక లక్ష్యాలతో ఏర్పాటయ్యాయని, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి, భోజనం, ప్రత్యేక పర్యవేక్షణ అందిస్తున్నాయని గుర్తుచేశారు. వాటి ప్రత్యేకతను కాపాడుతూ మరింత బలోపేతం చేయాలని కోరారు. గతంలో గురుకుల విద్యావ్యవస్థలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వంటి అధికారులు తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ, పర్యవేక్షణతో అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యావకాశాలు అందిపుచ్చుకున్నారని పేర్కొన్నారు.

ప్రతి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను నియమించాలని, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, డిజిటల్ బోధన, ప్రయోగశాలలు, ఆటస్థలాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల నిర్వహణకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి నాణ్యమైన ఉచిత విద్య అందించాలని సూచించారు.

రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణానికి భారీగా నిధులు వెచ్చించే బదులు, ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించి, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పేరుతో గ్రామీణ విద్యావ్యవస్థను కేంద్రీకరించే విధానాన్ని పునఃపరిశీలించి, సంబంధిత జీవోలను రద్దు చేయాలని వారు కోరారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులు, స్వేరోస్, ఇతర ప్రజాసంఘాలతో కలిసి ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేసి పేద విద్యార్థుల విద్యాహక్కులను కాపాడుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో స్వేరోస్ నాయకుడు చాపలమడుగు వీరబాబు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి!

- **నల్గొండ–వరంగల్–ఖమ్మం అభ్యర్థిగా ప్రకటన**
- **నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలపై పోరాడుతా.. పట్టభద్రుల గొంతుకగా నిలుస్తా**
- **టీఆర్ఎస్ (డి) రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణ**

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 12 (భద్రాద్రి న్యూస్):

నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి పోటీ చేయనున్నట్లు తెలంగాణ రక్షణ సమితి (డెమోక్రటిక్) రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణ ప్రకటించారు. గురువారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన అభ్యర్థిత్వాన్ని వెల్లడించారు.

ఈ సందర్భంగా నరాల సత్యనారాయణ మాట్లాడుతూ.. డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి తెలుగు రాష్ట్రాల రోటరీ ఇంటర్నేషనల్ సంస్థ గవర్నర్‌గా విశిష్ట సేవలందించారని తెలిపారు. కరోనా విపత్కర సమయంలో వేలాది మందికి రెండు నెలలపాటు నిరంతర అన్నదానం చేయడంతో పాటు ఆర్థిక సాయం అందించి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ పదవిని అధికారంగా కాకుండా బాధ్యతగా తమ పార్టీ భావిస్తోందని అన్నారు.

అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే నిరుద్యోగులు, ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యలపై నిరంతరం పోరాడుతానని తెలిపారు. నిరుద్యోగుల గొంతుకగా నిలిచి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తానన్నారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటు చేయడం, ప్రతి నియోజకవర్గంలో పట్టభద్రుల ప్రతినిధులతో కమిటీలు ఏర్పాటు చేయడం, ఇచ్చిన హామీల అమలుపై ఎప్పటికప్పుడు పట్టభద్రులకు నివేదిక అందించడం తన కార్యాచరణలో భాగమని వివరించారు. ఉద్యోగం, ఉపాధి, విద్య, ఆర్థిక భరోసా కల్పించడం తమ పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ తనకు మద్దతు తెలిపి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ఈ సమావేశంలో నాయకులు సాధు శంకర్, కొంపెల్లి ప్రదీప్ కుమార్, సాయం పోచయ్య తదితరులు పాల్గొన్నారు.







గో విజ్ఞాన పరీక్షలో శ్రీ రాగా విద్యార్థుల సత్తా

- **జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాలు.. రాష్ట్ర స్థాయికి ఇద్దరు విద్యార్థినుల ఎంపిక**

కొత్తగూడెం, నవంబర్ 12 (భద్రాద్రి న్యూస్):

జిల్లా స్థాయి గో విజ్ఞాన పరీక్షలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైన శ్రీ రాగా ప్లే అండ్ హైస్కూల్ విద్యార్థినులు టి. గణవి,ఎం. హర్షిణి అభినందనలందుకున్నారు.

కొత్తగూడెం పట్టణంలోని మేదరబస్తీలో గల శ్రీ రాగా ప్లే అండ్ హైస్కూల్‌కు చెందిన హైస్కూల్ విద్యార్థులు ఇటీవల స్వర్ణభారతి స్కూల్ వేదికగా నిర్వహించిన జిల్లా స్థాయి 'గో విజ్ఞాన' పరీక్షలో ప్రథమ స్థానాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు.

ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. పాఠశాల కరస్పాండెంట్ మల్లారపు వరప్రసాద్, డైరెక్టర్ మల్లారపు కవిత, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను సత్కరించి, రాష్ట్ర స్థాయిలోనూ ఇదే ప్రతిభను కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఈవెంట్ శిక్షకురాలు మహాలక్ష్మి, మార్గదర్శక ఉపాధ్యాయురాలు చరిత, ఉపాధ్యాయులు రాంబాబు, శోభారాణి, రామకృష్ణ, భాస్కర్, కీర్తి, అఖిల, వెంకటలక్ష్మి, దీప్తి, రమ్య, స్వాతి, నాగమణి, ఆఫ్రీన్ తదితరులు పాల్గొని విద్యార్థినులను అభినందించారు.





రాష్ట్రస్థాయి బాలోత్సవ్ ఖమ్మం ప్రతిష్టను పెంచాయి.

- --బాలోత్సవ్ కళా ప్రదర్శనలు సృజనాత్మకతను ప్రతిబింబించాయి.
- ---బాలోత్సవ్ కు అనూహ్య స్పందన రావడం నిర్వాహకుల సామర్థ్యాన్ని తెలియజేశాయి.
- --యువ నాయకుడు తుమ్మల యుగంధర్.
- --అంబరాన్నంటిన రాష్ట్రస్థాయి బాలోత్సవ్ సంబురాల పోటీలు.



ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 12 భద్రాద్రిన్యూస్

ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో గత రెండు రోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖమ్మం బాలోత్సవ్ సంబురాలు ఖమ్మం ప్రతిష్టను మరింతగా పెంచాయని తెలంగాణ కాంగ్రెస్ యువ నాయకుడు తుమ్మల యుగంధర్ పేర్కొన్నారు. స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో బాలోత్సవ్ ముగింపు వేడుకలకు తుమ్మల యుగేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. వారధి ఫౌండేషన్, ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహించిన బాలోత్సవ్ వేడుకల ముగింపు సభ గురువారం జరగగా తుమ్మల యుగేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా తుమ్మల యుగేందర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో నిర్వహించిన బాలోత్సవ్ కు అనూహ్య స్పందన రావడం నిర్వాహకుల సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుంది అన్నారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి బాలోత్సవ్ లు దోహదపడుతున్నాయని తెలిపారు. పిల్లలు మరింత చురుకుగా మానసిక, శారీరక దృఢత్వం పెంచడానికి బాలోత్సవ్ పోటీలు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. కళల ప్రదర్శనల ద్వారా పిల్లల్లో సహకార గుణం, క్రమశిక్షణ, పోటీ తత్వం అలవరుతుందని చెప్పారు. బాలోత్సవ్ నిర్వాహకులు వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీయడానికి ప్రతిష్టాత్మకంగా సాహసోపేతంగా ఈ రాష్ట్రస్థాయి బాలోత్సవ్ నిర్వహించామని వివరించారు. పిల్లల్లో ప్రతి ఒక్కరిలో ఏదో ఒక సృజన దాగి ఉంటుందని ఈ సృజనను పాఠశాలల ద్వారా ఉపాధ్యాయులు, గృహాల్లోని తల్లిదండ్రులు పరిశీలించి ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రస్థాయి బాలోత్సవ్ ఘనవిజయం సాధించడం తమకు మరింత సంతృప్తిని కలుగజేసిందని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి బాలోత్సవ్ లను నిర్వహించడానికి ప్రేరణ కలిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్లూమింగ్ మైండ్ స్కూల్ కరస్పాండెంట్ అశోక్ రెడ్డి, డాక్టర్ రాధికా రాణి, కొల్లి కల్పన, స్మార్ట్ కిడ్జ్ స్కూల్ డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాయల్ నాగరాజు, జిల్లా నాయకులు చిక్కుళ్ళ వెంకటేష్, పగిళ్లపల్లి రాజు, ఆర్ ఎన్ ప్రసాద్, రాజేష్, భవాని శంకర్, ముఖేష్, నాని సతీష్ , సంతోషి, తదితరులు పాల్గొన్నారు.

సభానంతరం సాంప్రదాయ నృత్యాలు , జానపద నృత్యాలు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలలో గెలుపొందిన సీనియర్, జూనియర్ విజేతలకు అతిథులు బహుమతి ప్రధానం చేశారు. గత రెండు రోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖమ్మం బాలోత్సవ్ సంబురాలు గురువారం రాత్రి తో ముగిసాయి. బాలోత్సవ్ పోటీలకు అనూహ్య స్పందన రావడం నిర్వాహకుల సామర్థ్యానికి దర్పణం పట్టాయి.

అంబరాన్నంటిన రాష్ట్రస్థాయి బాలోత్సవ్ సంబురాల పోటీలు.

స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖమ్మం బాలోత్సవ్ సంబురాలు బాలల సృజనాత్మకతకు దర్పణం పట్టాయి. రెండో రోజు గురువారం సాంప్రదాయ నృత్యాలు, జానపద నృత్యాల విభాగాలలో గ్రూప్ డాన్స్ పోటీలలో విద్యార్థులు సత్తా చాటారు. ఫాన్సీ డ్రెస్ పోటీలలో చిన్నారులు
ఎల్ నినో, కాలుష్యం, పర్యావరణ పరిరక్షణ అంశాలతో వస్త్ర ధారణతో పోటీలలో పాల్గొన్నారు. అదేవిధంగా చిన్నారులు భగత్ సింగ్, వీరనారి రాణి రుద్రమదేవి, శ్రీ వెంకటేశ్వర స్వామి, సైనికుడు, రైతు, రాకెట్, తదితర వేషధారణలతో అలరించారు. ఫాన్సీ డ్రెస్ చిన్నారులకు స్మార్ట్ కిడ్జ్ స్కూల్ డైరెక్టర్ చింత నిప్పు సుకన్య ప్రశంసా పత్రాలను అందజేశారు. జానపద గ్రూప్ డాన్స్ విభాగంలో ,సాంప్రదాయ గ్రూప్ డాన్స్ విభాగంలో విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణతో, ప్రాపర్టీస్లతో పాటకు అనుగుణంగా లయబద్ధంగా నృత్యాలు చేస్తూ సభా ప్రాంగణాన్ని రెండో రోజు ఉర్రూతలూగించారు. తమ పిల్లలు ప్రదర్శించిన నృత్యాలను అతిపెద్ద డిజిటల్ స్క్రీన్, డిజిటల్ లైట్ల వెలుగుల్లో తిలకించి తల్లిదండ్రులు మధురానుభూతిని చెందారు. అది పెద్ద వేదికపై తమ పిల్లలు చేసిన నృత్య ప్రదర్శనలకు పేరెంట్స్ ఫిదా అయ్యారు. పోటీల్లో పాల్గొన్న పిల్లలకు, వారి తల్లిదండ్రులకు, అతిథులకు నిర్వాహకులు షడ్రుచుల విందు భోజనాన్ని అందించడంతో ప్రతి ఒక్కరూ బాలోత్సవ్ నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా నిర్వాహకుల కృషికి బాల బాలికల నుంచి అనూహ్య స్పందన రావడంతో బాలోత్సవ్ నిర్వాహకుల్లో ఆనందోత్సవాలు వెల్లి విరిసాయి. బాలోత్సవ్ సంబురాలను, బహుమతి ప్రధానోత్సవ వేడుకలను వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య, ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాయల్ నాగరాజు, జిల్లా నాయకులు చిక్కుళ్ళ వెంకటేష్, పగిళ్లపల్లి రాజు, ఆర్ ఎన్ ప్రసాద్, రాజేష్, భవాని శంకర్, ముఖేష్, సతీష్, నాని , సంతోషి తదితరులు పర్యవేక్షించారు.

